క్లుప్తంగా

ఉచిత మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వరప్రసాద్

తిరుపతి తుడా: స్థానిక తిమ్మినాయుడు పాలెంలోని శ్రీ ప్రసాద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు ఎండీ డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 175 రోగులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక 50వ వార్డు కార్పొరేటర్ అనిల్, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవా కార్యక్రమాలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ యూనియన్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బుధవారం ఏటీఎం కార్యాలయం వద్ద బస్టాండ్‌లో పేదలకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.


సజ్జలకు అప్సా సత్కారం



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని బుధవారం విజయవాడలో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతా రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇతర అపరిష్కృత సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్రేన్‌ను ఢీకొన్న నారాయణ స్కూల్ వ్యాన్



క్రేన్‌ను ఢీకొట్టడంతో దెబ్బతిన్న నారాయణ విద్యాసంస్థల వ్యాన్ ముందుభాగం

తిరుపతి రూరల్: నారాయణ విద్యాసంస్థలకు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదం చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల సమీపంలో మంగళవారం రాత్రి నారాయణ విద్యాసంస్థలకు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ అతివేగంతో తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చంద్రగిరి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఓ క్రేన్ వాహనాన్ని ఢీకొంది. ఆ సమయంలో స్కూల్ వ్యాన్‌లో విద్యార్థులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వ్యాన్ డ్రైవర్‌కు రక్తగాయాలు అయ్యాయి. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నరేంద్రబాబు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి సేవలో ఉడిపి మఠం పీఠాధిపతి



విశ్వ వల్లభ దత్త స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఉడిపిలోని సోడి వడిరాజా మఠం పీఠాధిపతి విశ్వ వల్లభ దత్త స్వామీజీ దర్శించుకున్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 08 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 02 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,021 మంది స్వామివారిని దర్శించుకోగా 19,091 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో రూ.3.15 కోట్లు వచ్చాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 08 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రోడ్ల కనెక్టివిటీతో తిరుపతి అభివృద్ధి



దేవి పరాంతకదేవి రహదారిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, తుడా వీసీ హరికృష్ణ

తిరుపతి తుడా: రోడ్ల కనెక్టివిటీతో పట్టణ అభివృద్ధి మరింత సాధ్యం అవుతుందని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రేణిగుంట–తిరుచానూరు రోడ్డును కలుపుతూ నిర్మించనున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు కనెక్టివిటీపై తుడా వీసీ హరికృష్ణ, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక హీరో హోండా షోరూం తూర్పు వైపున నూతనంగా నిర్మించిన దేవి పరాంతకాదేవి మాస్టర్ ప్లాన్ రోడ్డును తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని పద్మావతిపురం సమీపం వరకు నిర్మించారు. పద్మావతిపురం హైస్కూల్ ప్రాంగణం నుంచి తిరుచానూరు చెరువు మీదుగా హోటల్ గ్రాండ్ రిడ్జ్‌కు తూర్పు వైపు నుంచి తిరుచానూరు రోడ్డును కలిపే ప్రతిపాదనను పరిశీలించారు. అనంతరం భూమన అభినయ్ మాట్లాడుతూ రేణిగుంట రోడ్డు నుంచి పద్మావతిపురం మీదుగా తిరుచానూరు రోడ్డును కలుపుతూ నిర్మించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. లక్ష్మీపురం కూడలి, శ్రీనివాస కల్యాణ మండపం, శిల్పారామం మీదుగా తిరుచానూరు, నేషనల్ హైవేకు వెళ్లేందుకు కొత్తగా నిర్మించే ఈ రహదారి ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై వేలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉందని, దేవి పరాంతకాదేవి రోడ్డును తిరుచానూరు వరకు విస్తరించడం వల్ల ప్రముఖ రహదారిగా మారుతుందన్నారు. నగరానికి కనెక్టివిటీని పెంచడంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతుందని తెలిపారు.







సు'స్వాగతం'.. సీఎం సార్..

తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి రేణిగుంట ఎయిర్‌పోర్టులో సాదరంగా స్వాగతం పలికారు. అలాగే జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి కూడా స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం అయిన సీఎంకు ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.

– రేణిగుంట

ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు

తిరుపతి (అలిపిరి): టీటీడీ స్థానిక ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 16న రాత్రి 12.34 గంటలకు ధనుర్మాసం ప్రారంభమవుతాయని చెప్పారు. శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు రోజూ ఉదయం 4 నుంచి 6 గంటల వరకు సుప్రభాతం స్థానంలో ఏకాంతంగా తిరుప్పావై పారాయణం, భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తామని తెలిపారు. అయితే సుప్రభాతం సేవా టికెట్లు జారీ చేయరని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పద్మావతి అమ్మవారి ఆలయంలో...

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారు. మొదటిరోజు డిసెంబరు 17న సాయంత్రం ధనుర్మాసం గంట ఉంటుందని, దీంతో సహస్ర దీపాలంకార సేవ రద్దయింది. ఆలయంలో నెల రోజుల పాటు ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ధనుర్మాసం గంట, ధనుర్మాస దర్శనం ఉంటుంది. అలాగే తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో ఉదయం 4 నుంచి 5.30 గంటల వరకు సుప్రభాతం స్థానంలో తిరుప్పావై పారాయణం, భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారు. తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో ఉదయం 4 నుంచి 5 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారని తెలిపారు.

బడ్జెట్ తీర్మానానికి ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2024–2025 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, తీర్మానాలు, 2023–2024 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలపడం జరిగిందని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం మేయర్ అధ్యక్షతన, కమిషనర్ బడ్జెట్ అజెండాను ప్రవేశపెట్టగా, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహాచారి, ఉమా అజయ్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొని బడ్జెట్ అజెండా తీర్మాన అంశాలపై చర్చించి ఆమోదించడం జరిగింది. గురువారం జరిగే సాధారణ కౌన్సిల్ సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదించిన బడ్జెట్ తీర్మానాలను ప్రవేశపెట్టి, సభ్యుల ఆమోదంతో బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వ పుర పరిపాలక శాఖ ఆమోదం కోసం పంపడం జరుగుతుందని వారు తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, సెక్రటరీ రాధిక, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, హార్టికల్చరల్ ఆఫీసర్ హరికృష్ణారెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

రూ.346 కోట్లతో కార్పొరేషన్ వార్షిక బడ్జెట్

తిరుపతి కార్పొరేషన్ 2024–25 వార్షిక బడ్జెట్, 2023–24 వార్షిక ఏడాది సవరించిన బడ్జెట్ ఆమోదమే ప్రధాన అంశాలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో బడ్జెట్ సమావేశాన్ని గురువారం ఉదయం 10 గంటలకు చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాధారణ కౌన్సిలర్ సమావేశం జరుగుతుంది. నగర మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన నిర్వహించే బడ్జెట్ కౌన్సిల్ సమావేశానికి టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కానున్నారు. ఆ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అజెండాలను ప్రవేశ పెట్టనున్నారు. నగర డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్స్ సభ్యులు సమావేశానికి హాజరు కానున్నారు. 2024–25 వార్షిక ఏడాదికి సంబంధించి రూ.346.56 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు. అలానే 2023–24 వార్షిక ఏడాదికి సంబంధించి సవరించిన బడ్జెట్‌ను ఆమోదించనున్నారు. బడ్జెట్ సమావేశాల అనంతరం 14 అంశాలతో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తారు. నగర అభివృద్ధి లక్ష్యంగా కౌన్సిల్లో పలు తీర్మానాలు చేయనున్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్: అఖిల భారత లాయర్స్ యూనియన్ (ఐలు) తిరుపతి శాఖ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి కోర్టుల ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ హక్కు చట్టంతో సామాన్య మానవుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని ఐలు తిరుపతి శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. నూతన చట్టంతో న్యాయవాదులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజలకు సమస్య ఎదురైనప్పుడు కోర్టులను ఆశ్రయించిన వారికి న్యాయం అందుతుందని, అలా కాకుండా అధికారులను ఆశ్రయిస్తే ఒకరికి మాత్రమే న్యాయం అందే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐలు తిరుపతి శాఖ అధ్యక్షుడు హరికృష్ణ, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐలు ప్రధాన కార్యదర్శి దేవరాజులు, మురళి, యోగానంద్, అజయ్ కుమార్, గాజుల కృష్ణయ్య, పాదర్తి రమణ, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీది అసమర్థ పాలన



కె.నారాయణ

తిరుపతి కల్చరల్: భారతదేశానికి రక్షక దళం ఉందంటే అది పార్లమెంట్ అని, అలాంటి పార్లమెంట్‌కే రక్షణ కల్పించలేని కేంద్రప్రభుత్వం అసమర్థ పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పరిపాలన వ్యవస్థలో లోకసభ, రాజసభ అత్యుత్తమమైనవని, పాలించే పాలసీ అంతా అక్కడి నుంచే ఉంటుందని అన్నారు. అలాంటి పార్లమెంట్‌లోకి అగంతకులు ప్రవేశించి గ్యాస్ బాంబులు ప్రయోగిస్తుంటే రక్షణ శాఖ నిద్రపోతోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లోకి ప్రవేశించాలంటే గ్యాలరీలలో ఐదారు అంచెలలో తనిఖీలు తర్వాత ప్రవేశం ఉంటుందన్నారు. అలాగే పార్లమెంట్ సభ్యులకు పాసులు కూడా ఉంటాయని తెలిపారు. పార్లమెంట్‌లో జరిగిన ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ బాధ్యత వహించాలని, అలాగే ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కోరారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత





పెళ్లికానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, కొమ్మేపల్లిలో పెళ్లికానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: మండలంలోని గాదంకి పంచాయతీ బత్తినివారిపల్లిలో త్వరలో వివాహం చేసుకోనున్న వధూవరులు బిందు, భానుప్రకాష్‌కు, దామలచెరువు పంచాయతీ కొమ్మేపల్లి హరిజనవాడలోని వధూవరులు లక్ష్మీప్రసన్న, అనిల్ కుమార్‌కు బుధవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమ సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు పట్టువస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యామల, గోపిరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రుకేష్‌రెడ్డి, వినాయక, వినయ్, లోకి, బుజ్జి, అశోక్, ప్రసాద్, శివ, శశి తదితరులు పాల్గొన్నారు.

పాచికాల్వ గంగమ్మకు సారె



పాచికాల్వ గంగమ్మ దర్శనానికి సారె తీసుకెళ్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల: తిరుమల గ్రామదేవత శ్రీ పాచికాల్వ గంగమ్మను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నముని తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా జన నీరాజనం



దివ్యాంగుడికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి

- గడపగడపలో మోహిత్ రెడ్డికి ఆదరణ
- జనంతో మమేకం..
- తమ అన్నయ్యను గెలిపించాలంటూ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి విజ్ఞప్తి

చంద్రగిరి: పల్లె ప్రజలకు ఆత్మీయతను పంచుతూ వారి కష్టాలు తెలుసుకుని ఆప్తునిగా ఆదరిస్తూ.. జనం కోసం జగన్ చేసిన మేలును వివరిస్తూ సంక్షేమ జాబితాలను అందజేస్తున్న యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదించాలని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రతి గడపలో విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇర్విశెట్టివారిపల్లి, తూర్పుపల్లి, గడ్డకిందపల్లి, ఎస్టీ కాలనీలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామ శివార్లలో హర్షిత్ రెడ్డికి పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. యువత పెద్దఎత్తున బాణసంచా పేల్చి సాదరంగా ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవతకు పూజలు చేసిన ఆయన ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అలాగే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే సంక్షేమ పథకాలు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన తన దృష్టికి వచ్చిన సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

రూ.9 కోట్లతో శరవేగంగా అభివృద్ధి పనులు

పనపాకం పంచాయతీలో రూ.9 కోట్లు ఖర్చు చేసి వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని హర్షిత్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో సిమెంటు రోడ్లు, సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, జగనన్న సమావేశ మందిరాలు, సిమెంటు బెంచీలు, రచ్చబండతో పాటు ప్రజలకు ఉపయోగకరమైన అన్ని రకాల వసతులు కల్పించామని వివరించారు. ప్రభుత్వం తరఫున అందించే సంక్షేమ పథకాలు కాకుండా ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కష్టం వచ్చినా, ఆపద వచ్చినా, పండుగలు, పర్వదినాలు వచ్చినా అండగా నిలిచి కుటుంబ పెద్దగా అందరికీ అందించే కానుకలతో సంతోషంగా ఉన్నామంటూ పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సీ.యుగంధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఈఓపీఆర్డీ శశిరేఖ, సెక్రటరీ శిరీష, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, మట్టా మధుసూదన్ రెడ్డి, నాయకులు మణియాదవ్, రెడ్డెప్ప, నాగభూషణం, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పసల నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు.

రవాణా కార్మికులను ఆదుకోండి



నిరసన తెలుపుతున్న ఆటో, ట్యాక్సీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులు

తిరుపతి కల్చరల్: ఆటో ట్యాక్సీ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్‌లో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, ట్రాన్స్‌పోర్ట్, ట్యాక్సీ వంటి రంగాల్లో వేలాదిమంది పని చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తేవాలని కోరారు. అలాగే ఈ–చలానా రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ట్యాక్సీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏపీ బాల, కోశాధికారి ఆర్‌వీ రమేష్, ఆటో యూనియన్ నేతలు సురేష్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.